# బలహీన వర్గాలకు ఆశాజ్యోతి

# షాహు మహారాజ్

- అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు షాహు మహారాజ్
- షాహు మహారాజ్ 151వ జయంతి వేడుకలు
- సామాజిక సమానత్వంపై సెమినార్




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూన్27:** సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు షాహు మహారాజ్ 151వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గాయత్రి నగర్, ఎల్బీనగర్‌లోని సమత నాలెడ్జ్ సెంటర్‌లో ఒక సెమినార్ ఘనంగా నిర్వహించబడింది. బుద్ధిస్ట్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ సొసైటీ, నేషనల్ సమత లాయర్స్ అసోసియేషన్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పూలే ఐడియాలజీ సొసైటీ, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.ఈ సెమినార్‌కు వివిధ రంగాల నుండి ప్రముఖులు, మేధావులు, విద్యావంతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డైరెక్టర్ ఇండస్ట్రీస్, డీఆర్‌డీఎల్ సైంటిస్టులు వంటి వారు పాల్గొని షాహు మహారాజ్ సేవలను కొనియాడారు.

## షాహు మహారాజ్ ఆశయాలు,కృషి

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...షాహు మహారాజ్ చేసిన విశేష సేవలను గుర్తు చేసుకున్నారు.ఆ కాలంలో సమాజంలో నెలకొన్న అసమానతలను, ముఖ్యంగా అంటరాని కులాలపై జరుగుతున్న వివక్షను ఆయన నిశితంగా పరిశీలించారని, వాటిని రూపుమాపడానికి అవిశ్రాంతంగా కృషి చేశారని పేర్కొన్నారు. దళితులు, అంటరానివారు, వెనుకబడిన జాతులకు విద్యను అందించాలనే సదుద్దేశ్యంతో ప్రత్యేక పాఠశాలలు, వసతి గృహాలను నిర్మించారని, ఎందరికో ఆర్థిక సహాయం అందించి బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచారని ప్రశంసించారు. భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లడానికి షాహు మహారాజ్ ఆర్థిక సహాయం అందించారని, ఆయన గొప్ప త్యాగశీలి అని వారు ఉద్ఘాటించారు. షాహు మహారాజ్, మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల ఆశయ సాధనలకు కృషి చేస్తూ, సమాజంలో అట్టడుగు స్థాయిలో జీవిస్తున్న వెనుకబడిన తరగతులు, దళితులు, సంచార జాతులకు సమాన న్యాయం అందించడానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సెమినార్ షాహు మహారాజ్ ఆశయాలను స్మరించుకోవడమే కాకుండా, ప్రస్తుత సమాజంలో కూడా ఆయన ఆదర్శాలు ఎంతగా ఆవశ్యకమో గుర్తు చేసింది.నేషనల్ సమత లాయర్స్ అసోసియేషన్ సెక్రటరీ, అడ్వకేట్ డాక్టర్ విభూతి వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథులుగా ఏఐబీబీజే అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు చిత్తారి అనంతయ్య, హైకోర్టు అడ్వకేట్ శైలేష్ నాయక్, హైకోర్టు ఏపీపీఓ తెలంగాణ స్టేట్ సామ్రాట్ వెంకట్, బహుజన పార్టీ నేషనల్ నాయకులు హనుమాన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# డా.అశోక్‌ను పరామర్శించిన డిప్యూటీ స్పీకర్ డాక్టర్ రామచంద్రనాయక్



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూన్27:** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై కోలుకుంటున్న ప్రముఖ సామాజిక వేత్త, హెూమియోపతి వైద్యులు డాక్టర్ పరికిపండ్ల అశోక్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డిప్యూటీ స్పీకర్ డాక్టర్ రామచంద్రనాయక్ పరామ ర్శిం చారు. మానుకోట లోని అడ్వ కేట్స్ కాలనీలో ఉన్న డాక్టర్ అశోక్ నివాసానికి చేరుకున్న డిప్యూటీ స్పీకర్, ఆయన ఆరోగ్య పరిస్థితి గురిం చి అడిగి తెలుసుకున్నారు. ఒక సేవా కార్యక్రమం నిమిత్తం చిన్న గూడూరు వెళ్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన ట్రిపుల్ రైడర్ యూత్ స్పోర్ట్స్ బైక్ ఢీకొనడంతో డాక్టర్ అశోక్ ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తృటిలో ప్రాణాపాయం నుండి తప్పించుకున్న ఆయనకు మొదట మానుకోటలో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది, ప్రస్తుతం కోలుకుంటున్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ డాక్టర్ రామచంద్రనాయక్ మాట్లాడుతూ...డాక్టర్ అశోక్ త్వరగా కోలుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సమాజ సేవలో పునరంకితం కావాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.డాక్టర్ అశోక్‌ను పరామర్శించిన వారిలో సుశ్రుత హాస్పిటల్ అధినేత డాక్టర్ మాలోతు రవీంద్ర నాయక్, బిజెపి నాయకులు ధారా వెంకటేశ్వర్లు, రానా, పైండ్ల శ్రీనివాస్‌తో పాటు పలు బిసి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

